క్లుప్తంగా

నేడు గ్రోత్ సెంటర్లో విద్యుత్ నిలిపివేత

మద్దిపాడు: మండలంలోని గుండ్లాపల్లి గ్రోత్ సెంటర్లో 33 కేవీ కొత్త లైన్ నిర్మాణం కారణంగా శనివారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటలకు విద్యుత్ నిలిపేస్తున్నట్లు ఏఈ చెన్నారెడ్డి తెలిపారు. కొత్త లేన్ వేస్తున్న కారణంగా విద్యుత్ నిలిపేస్తున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు

కారును ఢీకొన్న బైకు

● యువకుడికి తీవ్ర గాయాలు

మద్దిపాడు: రోడ్డు పక్కన ఆగి ఉన్న కారును వెనక వైపు నుంచి మోటార్ సైకిల్ ఢీకొనడంతో ఒక వ్యక్తి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన గుండ్లపల్లి సమీపంలోని గ్రోత్ సెంటర్ వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం సాయంత్రం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. కీర్తిపాడు గ్రామానికి చెందిన మోంద్రు కార్తీక్ అనే యువకుడు తన స్నేహితునితో కలిసి మోటార్ బైక్పై గ్రోత్ సెంటర్ వైపు వెళ్తున్నాడు. ఒంగోలు నుంచి గుంటూరు వైపు వెళ్తూ గ్రోత్ సెంటర్ సమీపంలో జాతీయ రహదారి పక్కన ఆగి ఉన్న కారును వెనుక నుంచి బలంగా ఢీకొంది. కార్తీక్కు బలమైన గాయాలయ్యాయి. స్థానికులు 108కు సమాచారం అందించడంతో సిబ్బంది వచ్చి క్షతగాత్రుడిని ఒంగోలు జీజీహెచ్కు తరలించారు. యువకుని పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ఎస్ఐ శివరామయ్య కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అభయాంజనేయస్వామి కైంకర్యాలకు పాత్రల సమర్పణ



స్వామివారికి రజత పంచపాత్రలు సమర్పిస్తున్న అభయాంజనేయస్వామి భక్త బృందం

ఒంగోలు మెట్రో: అభయాంజనేయస్వామి భక్త బృందం ఆధ్వర్యంలో ఒంగోలు మంగమూరు డొంక మర్రిచెట్టుకాలనీ వద్ద గల పాలిమేర అభయాంజనేయస్వామికి కై ంకర్యాలు, అభిషేకం నిమిత్తం శుక్రవారం రూ.70 వేల విలువ చేసే నూతన రజత పంచపాత్రలు(వెండి గిన్నెలు) సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు పరాంకుశం సమీర్ కుమార్ మాట్లాడుతూ ఈ నెల 22వ తేదీ హనుమాన్ జయంతి వేడుకల్లో భాగంగా ఉదయం ఆరు గంటలకు పంచామృత తిరుమంజనస్నపన కార్యక్రమాలు, విశేష పూల అలంకరణ, కదిళీ పల అర్చన, సహస్ర నాగావళి దళార్చన, మహా నివేదిత హారతి, మంత్రపుష్పం, తీర్థ ప్రసాద వినియోగం, మధ్యాహ్నం పన్నెండు గంటలకు అన్నదాన కార్యక్రమం, సాయంత్రం ఆరు గంటలకు స్వామివారికి విశేష అలంకరణ, బాజాభజంత్రీలతో రామనామ సంకీర్తనతో నగరోత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు పాల్గొనాలని కోరారు.

భ్రమరాంబ అమ్మవారికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణంలోని మార్కండేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం భ్రమరాంబ అమ్మవారిని అర్చకులు వరుణ్తేజ, ఆంజనేయ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా పూలతో అలంకరించి పూజలు నిర్వహించారు. మహిళా భక్తులు పెద్దసంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి అష్టోత్తర పూజలు, కుంకుమ పూజ చేశారు.

అధికారుల నిర్లక్ష్యం.. వాహనదారులకు ప్రాణ సంకటం

పొదిలి రూరల్: అధికారుల నిర్లక్ష్యం ఓ యువకుడికి ప్రాణపాయాన్ని తెచ్చిపెట్టింది. పొదిలి ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ఇటీవల సాగర్ పైప్లైన్ మరమ్మతుల కోసం గుంత తీశారు. పనులు పూర్తయిన తరువాత గుంతను పూడ్చకుండా అలాగే వదిలేశారు. శుక్రవారం విశ్వనాథపురం నుంచిపెదబస్టాండ్కు ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఓ యువకుడు ఆసుపత్రి వద్ద ఉన్న గుంత కనిపించక.. వాహనంతో సహా అందులో పడిపోయాడు. యువకుడు స్వల్ప గాయాలతో బయటపడటంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. స్థానికులు స్పందించి యువకుడితోపాటు వాహనాన్ని బయటకు తీశారు.



చీమకుర్తి రూరల్: బండ్లమూడిలో వైద్య సిబ్బంది ర్యాలీ



మద్దిపాడులో..

డెంగీ నివారణకు చర్యలు తీసుకోవాలి

చీమకుర్తి రూరల్: డెంగీ రాకుండా ముందుగా నివారణ పద్ధతులు తెలుసుకోవాలని డాక్టర్ కమల అన్నారు. శుక్రవారం మండలంలోని బండ్లమూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జాతీయ డెంగీ నివారణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు డెంగీ జ్వరం బారిన పడకుండా ముందగా అవగాహన కోసం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం సిబ్బందితో ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ కమల మాట్లాడుతూ డెంగీ అనేది వైరల్ జ్వరమని, ఎడిస్ దోమకాటుతో ఒకరి నుంచి మరొకరికి సంక్రమిస్తుందని, ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చేసుకోవాలని, దోమతెరలు వాడాలని తెలిపారు. కమ్యూనిటీ హెల్త్ అధికారి సీహెచ్ మాధవరావు, సూపర్వైజర్స్ పాల్గొన్నారు.

మద్దిపాడు: డెంగీ రాకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్ ఆనందమోహన్ అన్నారు. శుక్రవారం జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా ఆస్పత్రి సిబ్బంది నిర్వహించిన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమలతో డెంగీ వ్యాధి సంక్రమిస్తుందని, దీన్ని అరికట్టేందుకు దోమలను నివారించుకోవాలని తెలిపారు. ఇంటి పరిసరాల్లో దోమలు ఉత్పత్తి అయ్యే నీటి నిల్వలు ఉన్నాయేమో గమనించాలని, అటువంటి నీటి నిల్వలను శుభ్రం చేసి తొలగించాలన్నారు. ఇళ్ల తొట్లలో నీరు నిల్వ చేస్తుంటారని, అటువంటి తొట్లను మూసివేయాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటిస్తూ ఇళ్లలో ఉన్న తొట్లను, పాత్రలను శుభ్రం చేసి ఎండబెట్టుకుని, ఆ తర్వాత నీరు నిల్వ చేసుకోవాలని చెప్పారు. ముఖ్యంగా తాగి పడేసిన కొబ్బరి బోండాలు, టైర్లు ఇళ్లలో లేకుండా చూసుకోవాలని, వాటిలో నీరు చేరితే దోమలు ఉత్పత్తి అయ్యే అవకాశం మెండుగా ఉంటుందని హెచ్చరించారు. అనంతరం ఆస్పత్రి సిబ్బంది మద్దిపాడు సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి దోమల నివారణపై అవగాహన కల్పిస్తూ నినాదాలు చేశారు. సీహెచ్ఓ లలితమ్మ, రంజితకుమారి, సూపర్వైజర్ బాలకోటయ్య, హెచ్వీలు నాగరాజి, సీతమ్మ, జూనియర్ డాక్టర్లు పాల్గొన్నారు.

సంతనూతలపాడు: జాతీయ డెంగీ నివారణ దినోత్సవంలో భాగంగా మండలంలోని వేములపాడు ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి మెడికల్ ఆఫీసర్ శ్రావ్య అధ్యక్షత వహించారు. ఎడిస్ అనే దోమతో డెంగీ వ్యాధి వ్యాపిస్తుందని మెడికల్ ఆఫీసర్ శ్రావ్య ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఇంటి పరిసరాల్లో నీరు అధికంగా నిల్వ ఉంటే దోమలు ఎక్కువగా పెరుగుతాయన్నారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకుంటే దోమ వ్యాప్తి చెందదని, తద్వారా ప్రజలు డెంగీ బారి నుంచి విముక్తి పొందుతారని మెడికల్ ఆఫీసర్ శ్రావ్య పేర్కొన్నారు.



ఈతముక్కలలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది



సంతనూతలపాడు: వేములపాడులో..

నాగులుప్పలపాడు: డెంగీపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండి దోమల నివారణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు ఒనారియేల్ అన్నారు. జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం చదలవాడలో వైద్య సిబ్బందితో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఒనారియేల్ మాట్లాడుతూ నివాస ప్రాంతాల్లో డెంగీ దోమలకు ఆవాసమైన నీటి నిల్వలు లేకుండా చూడాలన్నారు.

డెంగీ జ్వరంపై అప్రమత్తంగా ఉండాలి

కొత్తపట్నం: డెంగీ జ్వరంపై అప్రమత్తంగా ఉండాలని కొత్తపట్నం పీహెచ్సీ డాక్టర్ రమ్యదీపిక, ఈతముక్కల పీహెచ్సీ డాక్టర్ సాయినాథ్ ప్రజలకు సూచించారు. శుక్రవారం జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా వారి ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కొత్తపట్నం పీహెచ్సీ నుంచి నినాదాలు చేసుకుంటూ బస్టాండ్ కూడలి వరకు, ఈతముక్కల పీహెచ్సీ నుంచి బస్టాండ్ కూడలి వరకు భారీ ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రమ్యదీపిక మాట్లాడుతూ ఇంటి పరిసరాల పరిశుభ్రత పాటించాలని, గ్రామంలో చెత్తాచెదారాన్ని శుభ్రం చేయించాలని సూచించారు. దోమలు ఉత్పత్తి కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. వర్షం పడినప్పుడు మురికినీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. తొట్లు, డ్రమ్ములలో నీరు నిల్వ ఉంటే దోమల లార్వా ఉత్పత్తి అయి దోమలు పెరుగుతాయని తెలిపారు. వాటి నివారణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. సాయినాథ్ మాట్లాడుతూ పారిశుధ్యం మెరుగుదల, దోమల నివారణకు మార్గాల గురించి వివరించారు. డెంగీ జ్వరం వచ్చే సూచనలు కనిపిస్తే వెంటనే దగ్గరలోని ప్రభుత్వ హాస్పిటల్లో చేరి రక్త పరీక్షలు చేయించుకుని మందులు వాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ మహేష్ కుమార్, ఎంపీహెచ్ఈవో శ్రీలక్ష్మి, పీహెచ్ఎన్ పద్మావతి, హెచ్వీ అజిత, ఎంపీహెచ్ఎస్ నాగేశ్వరరావు, ఎంపీహెచ్ఏ (ఎం) మురళి, సీహెచ్వో ఓంకారం, పీహెచ్ఎన్ ఇందిరాదేవి, సూపర్వైజర్ సులోచన, పి.ప్రభాకర్, ఏఎన్ఎంలు, ల్యాబ్ టెక్నీషియన్, స్టాఫ్నర్స్, పాల్గొన్నారు.

ఒంగోలు రూరల్ తహసీల్దార్గా నాయబ్ రసూల్



ఒంగోలు రూరల్ తహసీల్దార్ నాయబ్ రసూల్ను అభినందిస్తున్న ఒంగోలు ఆర్ఐ శ్రీనివాసరావు

ఒంగోలు సబర్బన్: ఒంగోలు రూరల్ తహసీల్దార్గా ఎస్కే నాయబ్ రసూల్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని వలేటివారిపాలెంలో డిప్యూటీ తహసీల్దార్గా విధులు నిర్వర్తిస్తూ ఇక్కడకు వచ్చారు. కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా అడ్హాక్ పదోన్నతుల్లో భాగంగా నాయబ్ రసూల్కు తహసీల్దార్గా పదోన్నతి కల్పిస్తూ ఒంగోలు రూరల్ మండల తహసీల్దార్గా బదిలీ చేశారు. ఒంగోలు మండలం నుంచి ఒంగోలు అర్బన్ మండలాన్ని 2023వ సంవత్సరంలో అప్పటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం విభజించింది. అప్పటి నుంచి ఒంగోలు అర్బన్, ఒంగోలు రూరల్ మండలాలకు కలిపి ఒక్కరే తహసీల్దార్గా వ్యవహరిస్తూ వచ్చారు. ఇటీవల ఒంగోలు అర్బన్ మండలం వెబ్ ల్యాండ్ను కూడా విభజించారు. దీంతో పూర్తి స్థాయిలో ఒంగోలు అర్బన్ మండలం రూపుదిద్దుకుంది. అందువల్ల ఒంగోలు అర్బన్ తహసీల్దార్గా జిల్లా రెవెన్యూ అసోసియేషన్ అధ్యక్షుడు, కొత్తపట్నం తహసీల్దార్గా పనిచేస్తున్న పిన్నిక మధుసూదన్రావును కలెక్టర్ నియమించారు. ప్రస్తుతం కొత్తపట్నం మండలానికి కూడా తహసీల్దార్గా (ఎఫ్ఏసీ) మధుసూదనరావు వ్యవహరిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఒంగోలు రూరల్ తహసీల్దార్గా బాధ్యతలు చేపట్టిన నాయబ్రసూల్ను ఒంగోలు రెవెన్యూ ఇన్స్పెక్టర్ శ్రీకంఠ శ్రీనివాసరావు, వీఆర్ఓలు కృష్ణారావు, చిరంజీవి, వెన్నపూస శ్రీనివాసరెడ్డి, ఇతర అధికారులు అభినందించారు.

శివానందలహరిలో జిల్లా ప్రముఖులు



నెమ్మాని దంపతులను సన్మానిస్తున్న శ్రీశైల దేవస్థానం కార్యనిర్వహణాధికారి

ఒంగోలు మెట్రో: సరస్వతీ నది పుష్కరాల ప్రారంభం సందర్భంగా శ్రీశైల మహాక్షేత్రంలో శుక్రవారం నిర్వహించిన శివానందలహరి ఉపన్యాసం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఒంగోలుకు చెందిన ప్రముఖ ప్రవచకులు నెమ్మాని సీతారామమూర్తి పాల్గొని జగద్గురు శంకరాచార్యులు రచించిన శివానందలహరిని విపులంగా విశ్లేషించారు. శ్రీశైలంలోని మహాలింగం గురించి చక్కగా వివరించారు. శంకరాచార్యుల వారు శ్రీశైలంలోని శివానందలహరి రచించడంలోని అంతర్యాన్ని ఆసక్తిగా తెలిపారు. సౌందర్యలహరిలో శివుడు కనిపిస్తాడు, శివానందలహరిలో అమ్మవారు కనిపిస్తుందంటూ పార్వతీ పరమేశ్వరుల సారూప్యాన్ని, సామీప్యాన్ని, సాయిజ్యాన్ని సంగీత సాహిత్యపరంగా, ఆర్షధర్మం ప్రకారం విశదీకరించారు. సరస్వతీ పుష్కరాల గురించి వివరిస్తూ.. ఋుగ్వేద కాలంలో దేశంలో ఉధృతంగా ప్రవహించిన సరస్వతీ నది ఆ తర్వాత అంతర్ధానమైపోవడం, మళ్లీ ప్రయాగ్రాజ్, శ్రీశైలంతో సహా అంతర్వాహినిగా భక్తుల పూజలు అందుకోవడం గొప్ప విశేషమని తెలిపారు. అనంతరం నెమ్మాని సీతారామమూర్తిని ఘనంగా సత్కరించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

జోరువానలోనూ సీహెచ్ఓల సమ్మె



నిరసన దీక్షలో పాల్గొన్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు

ఒంగోలు టౌన్: ఒకవైపు జోరుగా వర్షం కురుస్తున్నప్పటికీ మరోవైపు మొక్కవోని దీక్షతో సమ్మె కొనసాగించారు సీహెచ్ఓలు. స్థానిక కలెక్టరేట్ వద్ద కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు చేపట్టిన దీక్ష శుక్రవారం 18వ రోజుకు చేరింది. ఎండ, వానను లెక్కచేయకుండా తమ న్యాయమైన హక్కుల సాధన కోసం నిరసనకు దిగిన సీహెచ్ఓల పట్ల రాష్ట్ర ప్రభుత్వం తీవ్రమైన నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని, కనీసం జిల్లా అధికారులు ఇటువైపు తొంగిచూడకపోవడం దారుణమని సీహెచ్ఓలు మండిపడుతున్నారు. గ్రామీణ ప్రజల ఆరోగ్య సేవలు నిలిచిపోయినప్పటికీ, తాగునీటి నాణ్యత పరీక్షలు ఆగిపోయినప్పటికీ పాలకులకు చీమకుట్టినట్టయినా లేదని విమర్శిస్తున్నారు. ఈ సందర్భంగా ఏపీ ఎంసీఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.రాజేష్ మాట్లాడుతూ గర్భిణులు, చిన్నపిల్లలు సైతం తరలివచ్చి దీక్షలో పాల్గొంటున్నప్పటికీ ప్రభుత్వం సమ్మె విరమణకు చొరవ చూపకపోవడం విచారకరమన్నారు. న్యాయమైన సమస్యలను నిబంధనల ప్రకారం పరిష్కరించమని కోరుతున్నామని చెప్పారు. తక్షణం ప్రభుత్వం సీహెచ్ఓల సమ్మె పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సమ్మెలో జిల్లాలోని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు, ఏపీ ఎంసీఏ అసోసియేషన్ జిల్లా సెక్రటరీ గంటా ప్రసన్న, ఉపాధ్యక్షురాలు జీవన జ్యోతి, పసుపులేటి శైలజ, దీప్తి, కామేష్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేస్తా



చుండూరి రవిబాబును కలిసి కృతజ్ఞతలు తెలుపుతున్న అసోది యలమందారెడ్డి

ఒంగోలు టౌన్: ఒంగోలు నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ బలోపేతానికి బాధ్యతగా కృషి చేస్తానని ఆ పార్టీ వాణిజ్య విభాగం ఒంగోలు నగర అధ్యక్షుడిగా నియమితులైన అసోది యలమందారెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో పార్టీ ఒంగోలు నియోజకవర్గ ఇన్చార్జి చుండూరి రవిబాబు, నగర అధ్యక్షుడు కఠారి శంకర్రావులను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు పార్టీ పదవి రావడానికి సహకరించిన రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి, ఒంగోలు పార్లమెంట్ ఇన్చార్జి చెవిరెడ్డి భాస్కరరెడ్డి, జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

మా తుజే సలాం

● ఒంగోలులో భారీ ర్యాలీ నిర్వహించిన విద్యార్థులు

● మార్మోగిన భారత్ మాతాకీ జై నినాదాలు



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

ఒంగోలు టౌన్: నగరం నడిబొడ్డులో జాతీయ పతాకం రెపరెపలాడింది. వేలాది మంది విద్యార్థులు చేసిన భారత్ మాతాకీ జై నినాదాలతో దిక్కులు పిక్కటిల్లాయి. ఆపరేషన్ సింధూర్ విజయవంతమైన సందర్భాన్ని పురస్కరించుకుని నగరంలోని విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు భారీ జాతీయ పతాకంతో ర్యాలీ నిర్వహించారు. నగరంలోని ప్రధాన వీధుల మీదుగా భారీ పతాకాలను చేతబట్టి జై జవాన్, మురళీ నాయక్ అమర్ రహే నినాదాలు చేశారు. నెల్లూరు బస్టాండు సెంటర్, కలెక్టరేట్, చర్చి సెంటర్, ట్రంక్ రోడ్డు, పాత కూరగాయల మార్కెట్, కర్నూలు రోడ్డు, ఆర్టీసీ బస్టాండు సెంటర్, ఫ్లై ఓవర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో పలు విద్యా సంస్థల యజమాన్యాలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, నగర ప్రజల పాల్గొన్నారు.

జీజీహెచ్లో విజయవంతంగా యాంజియోప్లాస్టి ఆపరేషన్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏడుకొండలు

ఒంగోలు టౌన్: స్థానిక ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో గుండె జబ్బుతో బాధపడుతున్న ఒక రోగికి యాంజియోప్లాస్టీ ఆపరేషన్ చేసి ప్రాణాలు కాపాడారు. శుక్రవారం జీజీహెచ్లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో చీఫ్ కార్డియాలజిస్ట్ డాక్టర్ కుంచాల వెంకటేశ్వరరావు ఆ వివరాలు వెల్లడించారు. గుండెజబ్బుతో బాధపడుతున్న ప్రసాద్ జీజీహెచ్లో కార్డియాలజీ విభాగాన్ని సంప్రదించారు. అతడికి యాంజియోగ్రామ్ పరీక్ష నిర్వహించి గుండె కుడివైపు రక్తనాళాల్లో ఆటంకాలు ఉన్నట్లు గుర్తించారు. రోగికి వివరాలు తెలియజేసి స్టెంట్ వేసి ప్రాణాలు రక్షించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏడుకొండలు మాట్లాడుతూ ఇటీవల కాలంలో జీజీహెచ్లో ఎన్నో అరుదైన ఆపరేషన్లు చేస్తున్నట్లు తెలిపారు. జీజీహెచ్లో క్యాథ్ల్యాబ్ ప్రారంభించాక చేసిన తొలి ఆపరేషన్ వంద శాతం విజయవంతమైందన్నారు. ఆపరేషన్ చేసిన చీఫ్ కార్డియాలజిస్ట్ డాక్టర్ వెంకటేశ్వరరావు బృందాన్ని అభినందించారు. ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో ఈ ఆపరేషన్ను పూర్తి ఉచితంగా చేసినట్లు చెప్పారు. అదే ప్రైవేటు వైద్యశాలలో చేయాలంటే కనీసం 2 లక్షల రూపాయలు ఖర్చవుతుందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డా.కిరణ్కుమార్, సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ మాధవీలత, తదితరులు పాల్గొన్నారు.

నలుగురికి గోల్డ్ అవార్డుల ప్రదానం



అవార్డులు అందుకుంటున్న వాసవి క్లబ్ సభ్యులు

సంతనూతలపాడు: స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో శుక్రవారం సాయంత్రం జరిగిన ఒక కార్యక్రమంలో వాసవి కుటుంబ సురక్ష పథకం కింద జిల్లా గవర్నర్ సీహెచ్ గాయత్రి, జిల్లా కార్యదర్శి ఎం.రాఘవేంద్రరావు, ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ చంద్రశేఖర్, వాసవి క్లబ్ రీజియన్ చైర్ పర్సన్ సీహెచ్ సత్యనారాయణలు సంతనూతలపాడు వాసవి క్లబ్ ప్రతినిధులకు గోల్డ్ అవార్డులు ప్రదానం చేశారు. నెగిటివ్ బ్యాలెన్స్ లేకుండా చేసిన వాసవి క్లబ్ ప్రతినిధులు మద్ది శ్రీనివాసులు, వేమా శీను, వేమా అంకయ్య, చలువాది వెంకటేశ్వర్లుకు అవార్డులు అందజేశారు. కార్యక్రమానికి వాసవి క్లబ్ జిల్లా సహాయ కార్యదర్శి వేమూరి నాగేంద్ర ప్రసాద్రావు అధ్యక్షత వహించారు. వాసవి క్లబ్ జిల్లా ప్రతినిధి గ్రంధి లక్ష్మీప్రసాదరావు, అధ్యక్షుడు వేమూరి వెంకట శేషారావు, సెక్రటరీ వేమూరి ఆంజనేయులు, మహిళా క్లబ్ అధ్యక్షురాలు చలువాది చంద్రావతి, ప్రతినిధులు ఎస్.రాజేష్ వి.అంకయ్య, ఎం.శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, వేమా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

శిక్షణ ద్వారా జీవనోపాధులు

● కుట్టు శిక్షణ కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు వన్టౌన్: శిక్షణల ద్వారా జీవనోపాధులు మెరుగుపరుచుకోవాలని కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా సూచించారు. జిల్లా బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఒంగోలులోని డాన్బాస్కో ఐటీఐ సెంటర్లో మహిళలకు నిర్వహిస్తున్న కుట్టుశిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం కలెక్టర్ పరిశీలించారు. శిక్షణ పొందుతున్న మహిళలతో మాట్లాడారు. మహిళలు ఆర్థికంగా సాధికారత సాధించాలన్నారు. స్వశక్తితో ఎదగాలనేదే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఆ దిశగా పలు పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 31 కుట్టుశిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేసి మహిళలకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా శిక్షణ కేంద్రాల్లో 4,233 మంది మహిళలు శిక్షణ పొందుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీసీ కార్పొరేషన్ అధికారి ఎం.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రసన్నాంజనేయస్వామికి లక్ష మల్లెల పూజ



లక్ష మల్లెల పూజ అందుకుంటున్న ప్రసన్నాంజనేయస్వామి

ఒంగోలు మెట్రో: స్థానిక గద్దలగుంటలోని రాజాపానగల్ రోడ్డులో ఉన్న ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానంలో హనుమాన్ జయంతి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం స్వామివారికి లక్ష మల్లెల పూజ నిర్వహించారు. ఆలయ అర్చకుడు హరి ముందుగా వినాయకుని పూజ, పంచామృతాల అభిషేకం, అర్చన కైంకర్యాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం ఏడు గంటలకు సుహాసినిచే సామూహికంగా లక్ష మల్లెలతో స్వామివారికి అష్టోత్తరం, శతనామావళి పూజలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ ఈదుపల్లి దశరథరామారావు, రేణుకాదేవి దంపతులు, ఓం శ్రీహరి పారాయణ భక్త బృంద సభ్యులు ఓగిరాల సాయి, చెంగరశెట్టి చరణ్, బత్తుల వేణు, శంకర్, సంతోష్ కిరణ్, తదితరుల పర్యవేక్షణలో ఈ కార్యక్రమాలు నిర్వహించారు.



లక్ష మల్లెల పూజలో పాల్గొన్న మహిళా భక్తులు